క్లుప్తంగా

శ్రీరామనవమి ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏప్రిల్‌ 6న సీతారామచంద్రస్వామి కల్యాణం, అన్నదానం ఉంటుందని తెలిపారు. ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో కార్పొరేటర్‌లు, గ్రామపెద్దలు, మాజీ చైర్మన్లు, మాజీ కమిటీ సభ్యులు, ఆండాళ్‌ కుంకుమార్చన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రంగారెడ్డి అర్బన్‌ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వనిపల్లి శ్రీనివాస్‌ రెడ్డిని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరదల నరేష్‌, లంగటీ నరేందర్‌రెడ్డి మంగళవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి సాయికుమార్‌, సీనియర్‌ నాయకులు గోపాల్‌రావు, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ ప్రెసిడెంట్‌ ఎత్తరి రమేష్‌, వేణు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ ప్రారంభిస్తున్న డీఎం హరి

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో మంగళవారం డిపో ఉద్యోగులకు మజ్జిగ పంపిణీని డిపో మేనేజర్‌ హరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు వేసవి కాలంలో మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వేసవి కాలం అంతటా మజ్జిగను అందిస్తామని తెలిపారు. డ్యూటీపై ఎండలో వెళ్లి వచ్చిన కండక్టర్‌, డ్రైవర్స్‌కు మజ్జిగ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ అసిస్టెంట్‌ మేనేజర్‌ శ్రీలత, మెకానికల్‌ ఇంజినీరింగ్‌ రాజేశ్వరి, వెల్ఫేర్‌ కమిటీ సభ్యులు లక్ష్మి, శ్రీనివాస్‌, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ స్టేట్‌ కౌన్సిల్‌ మెంబర్‌గా కేశవరావు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ స్టేట్‌ కౌన్సిల్‌ మెంబర్‌గా నియమితులైన వీరమళ్ల కేశవరావును బీజేపీ నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్‌, జితేందర్‌, నర్సింగ్‌ యాదవ్‌, చారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

బాలనగర్: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని మంగళవారం తహసీల్దార్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సీనియర్‌ నాయకులు బీన్‌ సుదర్శన్‌ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల జీతాలు పెంచాలని, ఈ అసెంబ్లీ సమావేశంలో బడ్జెట్‌ కేటాయించాలని కోరారు. ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు అనిత, సబియా, ఆశా వర్కర్లు సంతోష, కవిత, విజయ, లక్ష్మి, సుమలత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఆయురారోగ్యాలతో జీవించాలి

ఇఫ్తార్‌ విందులో మాజీ మంత్రి కేటీఆర్‌

- ఘన స్వాగతం పలికిన ప్రజలు
- సెల్ఫీల కోసం ఎగబడ్డ జనం



ఇఫ్తార్‌ విందులో కేటీఆర్‌, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు



జనసందోహం నడుమ కేటీఆర్‌

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో జీవించాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ అన్నారు. మాజీ కౌన్సిలర్‌ మక్కాల నర్సింగ్‌ రావు హస్మత్‌పేట బడే మజీద్‌ దగ్గర 4 వేల మందికి మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందులో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు శంభీపూర్‌ రాజు, నవీన్‌రావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అల్లా దయతో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని కాంక్షించారు. కులమతాలకు అతీతంగా ఇఫ్తార్‌ విందుకు ప్రజలు పెద్ద రావడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వల్లబ్‌నగర్‌లో తెలంగాణ స్కూల్‌ వ్యాన్స్‌ అండ్‌ క్యాబ్స్‌ డ్రైవర్ల సంక్షేమ సంఘం నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు శంభీపూర్‌ రాజు, నవీన్‌రావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్‌ ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. ఆయా కార్యక్రమాలకు కేటీఆర్‌ హాజరుకావడంతో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సెల్ఫీలు దిగేందుకు కార్యకర్తలు, ప్రజలు ఎగబడ్డారు. చేసేదేమీ లేక కార్పొరేటర్‌ నివాసంలోకి ఇతరులు వెళ్లకుండ గేటుకు తాళం వేశారు. ఇఫ్తార్‌ విందులో పాల్గొని ప్రజల అభిమానాన్ని చూసి చలించిపోయారు.

కార్యక్రమంలో నాయకులు కర్రె జంగయ్య, బుర్రి యాదగిరి, గడ్డం నర్సింగ్‌రావు, రాజుగౌడ్‌, మక్కాల సత్యనారాయణ, బాల్‌రాజు, మట్టి శ్రీను, పోచయ్య, మల్లికార్జునయాదవ్‌, మల్లేష్‌యాదవ్‌, ఐలేష్‌, తిరుపతన్న తదితరులు పాల్గొన్నారు.

కాలనీలు, బస్తీలలో సౌకర్యాలు కల్పిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: అన్ని కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని మసీదుబండ సీఎంసీ ఎన్‌క్లేవ్‌ రెసిడెంట్స్‌వెల్ఫేర్‌ అసోసియేషన్‌ వినతిపై ఆయన మంగళవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అసంపూర్తిగా మిగిలిన సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, యూజీడీ పనులను కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చాలని, వీధిదీపాలను వెలిగేలా చూడాలని కోరారు. వాటర్‌ ట్యాంకర్లతో కాలనీలో ఏర్పడన ట్రాఫిక్‌ సమస్యను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందించారు. కాలనీలో అన్ని సమస్యలకు త్వరలో మోక్షం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాజుయాదవ్‌, మల్లేష్‌యాదవ్‌, మహేష్‌, సాంబశివరావు, రామ్మోహన్‌, మురళీకృష్ణ,మూర్తి, శ్రీనివాస్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్‌ సభ్యుడికి డైరీ అందజేత



సాక్షి,సిటీబ్యూరో: భారత ప్రభుత్వ షెడ్యూల్డ్‌ కులాల జాతీయ కమిషన్‌ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌కు మంగళవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌లో టీజీవోస్‌ జిల్లా కమిటీ అసోసియేషన్‌ సభ్యులు నూతన డైరీని అందజేశారు. అనంతరం జిల్లా ప్రతినిధులు మెమోంటోలను అందజేసి ఘనంగా సత్కరించారు. తెలంగాణ గెజిటెడ్‌ అధికారుల సంఘం మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్‌, కార్యదర్శి డాక్టర్‌.కురుమూర్తి, సంఘం జిల్లా నేతలు రవీందర్‌, సాంబశివరావు తదితరులున్నారు.

ఇంటర్‌ పరీక్ష రాస్తున్న విద్యార్థినికి అస్వస్థత

కీసర: ఇంటర్‌ పరీక్ష రాస్తున్న విద్యార్థిని అస్వస్థతకు గురైంది. కీసరలోని శ్రద్ధ జూనియర్‌ కళాశాలలో బాలాజీనగర్‌కు చెందిన ఇంటర్‌ విద్యార్థిని ప్రవళిక మంగళవారం ఎకనామిక్స్‌ పరీక్షకు హాజరైంది. పరీక్ష రాస్తుండగా ఒక్కసారిగా ఫిట్స్‌ రావడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. అప్రమత్తమైన కళాశాల సిబ్బంది చికిత్స నిమిత్తం ఆమెను స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నాచారంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ



పండ్లు అందజేస్తున్న కార్పొరేటర్‌ నర్సింహయాదవ్‌

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లి వ్యవసాయ కూరగాయల మార్కెట్‌ మాజీ డైరెక్టర్‌ బాల్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం అంజయ్యనగర్‌ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌, రిటైల్‌ కూరగాయల మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సత్యనారాయణ హాజరయ్యారు. అనంతరం అంజయ్యనగర్‌లోని నల్లపోచమ్మ అలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మేకల హరినాథ్‌, నాగేష్‌, మల్లేష్‌యాదవ్‌, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌, నర్సింహ్మ, రాజుగౌడ్‌, పోచయ్య, సరోజాదేవి, ఉమా, గంగమ్మ కవిత తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: అంజయ్యనగర్‌కు చెందిన అద్దాల శ్రీనివాస్‌ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయనను కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ నాయకులతో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఐలేష్‌, తిరుపతన్న, రాజుయాదవ్‌, బుర్రి యాదగిరి, మక్కాల అశోక్‌, మట్టి శ్రీను, రాజుగౌడ్‌, పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మంద మధుకర్‌, బ్యాగరి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

చెరువు రూపురేఖలు మారుస్తాం



కాయిదమ్మకుంట చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు పునరుద్ధరణ పనులతో దశ దిశ మారుస్తామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్‌ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు సుందరీకరణలో భాగంగా నెక్సస్‌ సెలెక్ట్‌ మాల్స్‌ సంస్థ సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌ ద్వారా మల్లిగవాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువు పునర్జీవనంలో భాగంగా సుందరీకరణ, పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురికి కుంపటిగా ఉన్న చెరువు స్వచ్ఛమైన మంచి నీరు లాంటి చెరువుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.

బస్తీ దవాఖానాల తనిఖీ



ప్రేమ్‌నగర్‌ బస్తీ దవాఖానాలో తనిఖీలు చేస్తున్న శేరిలింగంపల్లి జోన్‌ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కె.సుధాకర్‌ లాల్‌

చందానగర్: హఫీజ్‌పేట్‌ పరిధిలోని బస్తీ దవాఖానాలను మంగళవారం శేరిలింగంపల్లి జోన్‌ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కె.సుధాకర్‌ లాల్‌ ఆకస్మిక తనిఖీలు చేసి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ పరిధిలోని 272 బస్తీ దవాఖాలలో అందుతున్న వైద్య సేవలపై వైద్య ఆరోగ్య కమిషనర్‌, డైరెక్టర్‌ ఆఫ్‌ హెల్త్‌ ఆదేశాల మేరకు గ్రేటర్‌ హైదరాబాద్‌లోని అర్బన్‌ పీహెచ్‌సీ హఫీజ్‌పేట్‌ పరిధిలోని ప్రేమ్‌నగర్‌, హెచ్‌ఎంటీ కాలనీలోని బస్తీ దవాఖానాలను, శేరిలింగంపల్లి పీహెచ్‌సీ పరిధిలోని గంగారం బస్తీ దవాఖానాలను విస్తృత తనిఖీలు చేశామన్నారు. బస్తీ దవాఖానాలలో అందుతున్న సేవలను పరిశీలించామని, మరింత నాణ్యమైన వైద్య సేవలందించేందుకు కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు.

ప్రభుత్వ పథకాల్లో ఎస్సీలకు ప్రయోజనం చేకూర్చాలి



కార్యక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్‌ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌, కలెక్టర్‌ గౌతమ్‌

జాతీయ ఎస్సీ కమిషన్‌ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌

సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఎస్సీ సామాజికవర్గానికి ప్రయోజనం చేకూరేలా అధికారులు అవగాహన కల్పించాలని జాతీయ ఎస్సీ కమిషన్‌ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌ అన్నారు. మంగళవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ వీసీహాల్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ, వడ్డీలేని రుణాల పథకాలు ఎస్సీవర్గాలకు అందేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలశాఖ ద్వారా స్వయం ఉపాధికి సంబంధించిన చిన్న కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు ఔత్సాహిక యువతను ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్‌ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన సరుకులు, భోజనంపై సభ్యులను ఆయన అడిగి తెలుసుకున్నారు. స్కాలర్‌షిప్స్‌ తదితర విషయాలపై చర్చించి అడ్మిషన్‌లకు ఇబ్బంది కలగకుండా చూడాలని, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్‌కు సూచించారు. అట్రాసిటి కేసుల్లో జాప్యం కలగకుండా సంబంధిత తహసీల్దార్‌ ధ్రువీకరణపత్రాలను త్వరితగతిన అందించాలని సూచించారు.

- ఎస్సీలకు అందించే వివరాల శాతాల జాబితాను పవర్‌ పాయింట్‌ ప్రెజెంటేషన్‌ ద్వారా జిల్లా కలెక్టర్‌గౌతమ్‌ ఆయనకు వివరించారు. పోలీస్‌ కమిషనర్‌ సుధీర్‌బాబు, జాతీయ కమిషన్‌ డైరెక్టర్‌ సునీల్‌ కుమార్‌లను సత్కరించారు. డీసీపీలు పద్మజ, కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి వినోద్‌కుమార్‌, వివిధ శాఖల జిల్లా అధికారులు ఝూన్సీరాణి, డాక్టర్‌ ఉమాగౌరీ, జ్యోతి, చంద్రకళ, రాధిక, శేఖర్‌, సాంబశివరావు, సుగుణాబాయి, ఆర్డీఓలు శ్యామ్‌ప్రకాష్‌, ఉపేందర్‌రెడ్డి, ఏసీపీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



భరత్‌నగర్‌ కాలనీలోని శ్రీవిజన్‌ టాలెంట్‌ స్కూల్‌లో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక, సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్‌ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – మూసాపేట

> పరిశ్రమల నుంచి వెలువడుతున్న విష వాయువులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నియంత్రించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. పైగా సమస్య పరిష్కరించాలని ప్రజలు నిరసనలు చేపట్టి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న ఫలితం లేకుండా పోయింది. పారిశ్రామిక వాడల నుంచి వచ్చే కాలుష్యంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విషవాయువులతో ఉక్కిరి బిక్కిరి

పారిశ్రామిక వాడల నుంచి వెలువడుతున్న కాలుష్యం

పట్టించుకోని అధికారులు



సమస్యపై మండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు



నిజాంపేట్: గడ్డ పోతారం, ఐడీఏ బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడలతో గాజులరామారంలోని ఎలీఫ్‌ పారిశ్రామిక వాడ, అదే విధంగా జీడిమెట్ల లాంటి ప్రాంతాల నుంచి ప్రతి నిత్యం విష వాయువులు వెలువడుతున్నాయి. వాతావరణంలోకి వదులుతుండటంతో విష వాయువులను పీల్చుకోవాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం శాసన మండలిలో శంభీపూర్‌ రాజు సైతం ఈ సమస్య తీవ్రతను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

అర్ధరాత్రి, తెల్లవారుజామున..

వివిధ పరిశ్రమల నుంచి అర్ధరాత్రి, తెల్లవారుజామున ఈ విష వాయువులను గాలిలోకి వదులుతున్నారు. ఈ సమయంలో ప్రజలు పెద్దగా గుర్తించరని పరిశ్రమల నిర్వాహకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. అదే విధంగా వ్యర్థ జలాలను సైతం బయటకు వదులుతుండటంతో ఈ కెమికల్‌ వ్యర్థాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విష వాయువులతో ఘాటైన వాసనాలు రావడంతో ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం సదరు పరిశ్రమలను గుర్తించడంలో విఫలమవుతున్నారు.

వెల్లువెత్తుతున్న నిరసనలు

వివిధ పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషవాయువులను అరికట్టాలని, పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఇటీవలే కార్పొరేటర్‌ విజయలక్ష్మి సుబ్బారావుల ఆధ్వర్యంలో బాచుపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించారు. ప్రగతినగర్‌లోని ఎలీఫ్‌ పారిశ్రామిక వాడ ప్రజలు ఎలీఫ్‌ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు.

పట్టించుకోని అధికారులు

కాలుష్యం నుంచి తమను కాపాడాలని ప్రజలు అనేక సార్లు అధికారులు ఫిర్యాదు చేశారు. అయినా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఫిర్యాదు చేసిన సమయంలో పరిశీలించి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు



ప్రగతినగర్‌ ఎలీఫ్‌ పారిశ్రామిక వాడ నుంచి వెలువడుతున్న విషవాయువులను నియంత్రించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఫిర్యాదు ఇచ్చినప్పట్లో కొద్దిగా నియంత్రణ ఉన్నట్లు ఉంటుంది. తరువాత పరిస్థితి అలాగే ఉంటుంది. ఈ సమస్యపై ఆందోళన సైతం చేసినా అధికారుల్లో స్పందన లేదు. – శివకుమార్‌, ప్రగతినగర్‌



స్పెషల్‌ టీం ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్సీ



నియోజకవర్గంలోని కాలుష్యంపై శాసన మండలిలో ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు మాట్లాడారు. పారిశ్రామిక వాడల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు స్పెషల్‌ టీంలను ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రజలు వాయు, నీటి కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు మార్లు పీసీబీ అధికారులతో మాట్లాటిన చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వాడల దగ్గరలో ఎక్కడ బోరు వేసినా రసాయన జలాలు వస్తున్నాయన్నారు. సకాలంలో నియంత్రించకుంటే హైదరాబాద్‌లో కాలుష్యం మరింత పెరిగిపోయే ప్రమాదముందన్నారు. ఖాజీపల్లి, గడ్డపోతారం, జీడిమెట్ల, ఐడీఏ బొల్లారం ప్రాంతాలపై పీసీబీ అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.